క్లుప్తంగా

ఉపాధి హామీ పథకం జేఈగా సంగీతలక్ష్మి

కరప: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలోని జాతీయ ఉపాధి హామీ పథకం జేఈగా కె.సంగీతలక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఏలేశ్వరం మండలం నుంచి కరప మండలానికి బదిలీపై వచ్చారు. కరపలో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్‌లు టి.రాజేందర్, కేజే ప్రకాష్‌లు తాళ్లరేవు మండలానికి బదిలీ అయ్యారు. కాకినాడరూరల్ మండలంలో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్ బి.జానకి బదిలీపై కరప వచ్చినట్టు ఏపీఓ జీవీ రమణకుమార్ తెలిపారు.

దంత వైద్యులకు సన్మానం



అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో దంతవైద్యులకు సన్మానం

కాకినాడ రూరల్: జాతీయ దంత వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం దంతవైద్యులను ఘనంగా సన్మానించారు. తొలుత దంత వైద్యుల దినోత్సవం నిర్వహించిన దంత వైద్యులు అడ్డాల సత్యనారాయణ, సువర్ణ రాజు, వల్లీ తదితరులను అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, శ్రీనగేష్, కృష్ణమోహన్, కుమార్ యాదవ్, బుద్ధరాజు సత్యనారాయణరాజు తదితరులు సన్మానించారు. ఈ సందర్భంగా దంత వైద్యుడు అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ ముఖం నిండుగా అందంగా కనిపించాలంటే దంతాలు అమరిక సక్రమంగా ఉండాలన్నారు. దంత శస్త్ర చికిత్స ద్వారా దంతాల అమరికను సరిచేయవచ్చన్నారు.

అడ్డాల సేవలు మరువలేనివి



సత్యనారాయణను సత్కరిస్తున్న ఆదిత్య పీజీ కళాశాలల కో ఆర్డినేటర్ నాయుడు

బోట్‌క్లబ్: దంత వైద్యుడిగా అడ్డాల సత్యనారాయణ అందిస్తున్న సేవలు మరువలేనివని ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాల అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు అన్నారు. స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో అంతర్జాతీయ దంత వైద్యుల దినోత్సవం గురువారం నిర్వహించారు. దంత వైద్యులు అడ్డాల సత్యనారాయణను సత్కరించి, జ్ఞాపిక అందించారు. ఆయన సేవలు యువతకు ఆదర్శమన్నారు. గత 26 సంవత్సరాలుగా కాకినాడ, పరిసర గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నిరంతర వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. అడ్డాల మాట్లాడుతూ దంత వైద్యంలో ఇప్పుడు ఎంతో ఆధునీకరణ చోటుచేసుకుందని, దంతాలు ఎంత పాడైన కూడా తీయకుండా కాపాడే వైద్య పరికరాలు ఇప్పుడు ఉన్నాయని, మంచి నోటి ఆరోగ్యం వల్ల మన శరీర ఆరోగ్యం కూడా బాగుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు తేజేశ్వరరావు, గౌరీ ప్రియ, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత కంటి పరీక్షలు

బోట్‌క్లబ్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కాకినాడ వాసన్ కంటి ఆసుపత్రి లో 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకు మహిళలక ఉచిత కంటి పరీక్షలు నిర్వహించనున్నట్టు బ్రాంచ్ మేనేజర్ స్వామి వందనం గురువారం విలేకరులకు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో కంటి శుక్లం (కంటి పొర), కంటి నరం రెటీనా, నీళ్ల కాసులు (గ్లూకోమా) నిపుణులైన వైద్యులు సేవలు అందిస్తారని తెలిపారు. అన్ని రకాల శస్త్రచికిత్సలు చేస్తారన్నారు. టూ టౌన్ స్టేషన్ సమీపంలో నూకలమ్మ గుడి పక్కన ఉన్న వాసన్ కంటి ఆసుపత్రిని సంప్రదించాలన్నారు. మరెన్ని వివరాలకు 9392140005 తెలుసుకోవచ్చునన్నారు.

సాగునీటి సరఫరాకు ఏర్పాట్లు

కాకినాడ సిటీ: తాళ్లరేవు మండలం పి.మల్లవరం పంచాయతీ గ్రాంటు గ్రామంలో వరి పొలాలకు సాగునీరు అందించాలని కోరిన రైతులకు తగిన ఏర్పాట్లు చేసినట్టు కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రాంట్ గ్రామానికి వంతుల వారీగా సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఆ నీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ నీటిని ఎగువన ఉన్న రైతులు ఇంజిన్లు, మోటార్లతో తోడినా, అక్రమంగా దారి మళ్లించినా, కాలువలకు గండ్లు కొట్టినా వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే సంబంధిత అధికారుల విధులకు ఆటంకం కలిగించినా, అరెస్టు చేస్తామని హెచ్చరించారు. గ్రాంటు గ్రామానికి వెళ్లే నీరును ఎవరైనా అక్రమంగా వినియోగించినా, ఇంజనులతో తోడినా, దారి మళ్లించినా చూసిన వారు కలెక్టర్ 7993332244 నంబర్‌కు వాట్సాప్ ద్వారా సమాచారం అందించాలని కలెక్టర్ షణ్మోహన్ సగిలి తెలిపారు.

వసూలు ఫుల్.. రక్షణ నిల్..

- థియేటర్ల వద్ద వాహనాలకు రక్షణ కరువు
- ఆందోళన చెందుతున్న ప్రేక్షకులు
- పట్టించుకోని యాజమాన్యాలు



ఒక థియేటర్‌లో ఎండలో ఉన్న కార్లు

బోట్‌క్లబ్: తరచూ ఫీజులు భారీగా వసూలు చేస్తున్న సినిమా హాళ్లలో పార్కింగ్ వాహనాలకు మాత్రం రక్షణ కల్పించడంలేదు. థియేటర్‌కు వెళ్లే వారు సినిమా టికెట్‌తో వాహన పార్కింగ్‌కు కూడా డబ్బులు ఎక్కువగా వెచ్చించాల్సి వస్తోంది. అయినా వాహనాలకు రక్షణ లేకుండాపోతోంది. కాకినాడ నగరంలో 16 సినిమా థియేటర్లు ఉన్నాయి. పార్కింగ్ రుసుం వసూలు చేస్తున్న థియేటర్ యాజమాన్యం వాహనాలకు మాత్రం ఎటువంటి రక్షణ కల్పించడం లేదు. ఎండలో ఎండి, వర్షంతో తడుస్తున్న వాహనాలు పాడైపోతున్నాయి. మూడు గంటల సేపు వాహనం పార్కింగ్ చేస్తే రూ.20 వసూలు చేస్తున్నారు. కానీ వాటికి రక్షణగా షెడ్లు ఏర్పాటు చేయడంలేదు. బరంగ ప్రదేశాల్లో ఎండలో వాహనాలు పెట్టడంతో పెట్రోలు ఆవిరైపోతోంది. దీనికి తోడు వాహనాల రంగు మారిపోతోంది. నగరంలో రెండు, మూడు థియేటర్లు మినహా అన్ని థియేటర్లలోను పార్కింగ్ ప్రదేశం సక్రమంగా లేదు.

పార్కింగ్ లీజుకు ఇవ్వడంతో..

నగరంలో ఉన్న థియేటర్లలో సగానికి పైగా పార్కింగ్ రుసుం వసూలు చేసుకొనేందుకు బయట వ్యక్తులకు సంవత్సరాలు లెక్కన లీజుకు ఇస్తున్నారు. దీంతో లీజుకు తీసుకొన్న వ్యక్తి అక్కడ బయట సిబ్బందిని పెట్టుకొని ప్రేక్షకుల జేబులు ఖాళీ చేస్తున్నారు. దీంతో పార్కింగ్ రుసుం తరచూ పెంచుతున్న థియేటర్ల యాజమాన్యం చూసీ చూడనట్లు వ్యవహరిస్తోంది.



ఓ థియేటర్ వద్ద ఎండలో ఉన్న ద్విచక్ర వాహనాలు

వాహనాల్లో పెట్రోల్ ఉండక..

ద్విచక్రవాహనాల్లో నిండుగా పెట్రోల్ పోయించుకొని థియేటర్‌కు వెళితే తిరిగి వచ్చే సమయానికి అందులో పెట్రోలు పూర్తిగా ఉంటుందన్న నమ్మకం లేదు. థియేటర్లలో పనిచేసే సిబ్బంది తమ చేతికి పని చెబుతున్నారన్న ఆరోపణలు అనేకం. ఈ విషయంపై అనేకమార్లు థియేటర్లు వద్ద ప్రేక్షకులు పార్కింగ్ సిబ్బందితో వాగ్వివాదానికి సందర్భాలు అనేకం ఉన్నాయి. ఈ విషయంపై థియేటర్ యజమాన్యానికి ఫిర్యాదు చేసిన పార్కింగ్ విషయం మాకు సంబంధం లేదని చేతులు దులుపుకొంటున్నారు.

రంగు మారిపోయి..



ఎండలో బైక్ గంటలు తరబడి ఉండడం వల్ల పెట్రోల్ ఆవిరైపోతుంది. ఇంజిన్ కూడా పాడైపోతుంది. వాహనాలు రంగు మారిపోతాయి. సాధ్యమైనంత వరకూ నీడలో పార్కింగ్ చేసుకోవాలి. ఎక్కువ సేపు ఎండలో వాహనాలు పార్కింగ్ చేయకూడదు.

– కె.శ్రీను, బైక్ మెకానిక్

డబ్బులు తీసుకొని రక్షణ కల్పించక..



మా వాహనాలకు ఎటువంటి రక్షణ లేకుండా ఎండలో వదిలివేస్తున్నారు. ఈ మాత్రం దానికి రూ.20 వసూలు చేయడం ఎందుకు, పార్కింగ్ రుసుం పేరుతో లక్షలు గడిస్తున్న యజమానులు వాహనాలకు రక్షణ లేకుండా చేయడం దారుణం. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

– గొల్లపల్లి శివ, ప్రేక్షకుడు

మనోవికాసానికి మనసైన కథలు దోహదం



పాఠశాలలో నిర్వహించిన కహానీయోంకా కార్వాన్‌లో పాల్గొన్న చిన్నారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): మనోవికాసానికి మనసైన కథలు దోహద పడతాయని, ఈ కిడ్స్ విభాగంలో చిన్నారులు తమ సృజనాత్మకతలను వెలికి తీసేలా ఎంతో చక్కగా నీతి కథలు చెప్పారని నారాయణ పాఠశాలల ఏజీఎం కె.రాఘవేంద్రరావు చెప్పారు. గురువారం స్థానిక రామారావు పేటలోని నారాయణ పాఠశాలలో కహానీయోంకా కార్వాన్ గ్రాండ్ ఫినాలే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాకినాడ జోన్ పాఠశాలల ఈ కిడ్స్ వైస్ ప్రిన్సిపాల్స్, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా ఆర్ అండ్‌డీ హెడ్ సుస్మిత, ఎస్ఎస్‌టీ షకిల్ హాజరయ్యారు. గెలుపొందిన విద్యార్థులకు ముఖ్యఅతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ సుభద్ర, కోఆర్డినేటర్లు సపూరా, ప్రియ, సాఫ్ట్‌స్కిల్ ఆర్‌పి రాధాకృష్ణ, క్లస్టర్ ప్రిన్సిపాల్ చక్రధర్, ప్రిన్సిపాల్స్ షర్మిల, కవిత, రవికిషోర్ పాల్గొన్నారు.

ఆకర్షణీయంగా సూర్యారావుపేట బీచ్

- కలెక్టర్ షణ్మోహన్
- అధికారులతో కలిసి పరిశీలన
- క్లీనింగ్ పనులపై ఆగ్రహం



సూర్యారావుపేటలో బీచ్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ రూరల్: సూర్యారావుపేట న్యూ ఎన్టీఆర్ బీచ్, పరిసరాలు ఆకర్షణీయంగా ఉన్నాయని కలెక్టరు షణ్మోహన్ పేర్కొన్నారు. బీచ్‌లో జరుగుతున్న పనులను గురువారం ఆయన పరిశీలించారు. పర్యాటక, కాకినాడ నగరపాలక సంస్థ, పంచాయతీ, కొడా తదితర శాఖల అధికారులతో కలిసి కలెక్టరు పర్యటించి సముద్ర తీర ప్రాంతంలో ప్రస్తుతం నిర్వహిస్తున్న వివిధ కార్యకలాపాలు, బీచ్ క్లీనింగ్, నూతనంగా చేపట్టబోయే వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై ఆరా తీశారు. నెల రోజుల్లో బీచ్ సుందరీకరణ పనుల పూర్తి చేసి సందర్శకులకు అందుబాటులోకి తీసుకురావాన్నారు. బీచ్ క్లీనింగ్ అధ్వానంగా ఉండడంతో సంబంధిత అధికారులు, ఆపరేటరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరు షణ్మోహన్ మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకుకు మెరగైన సౌకర్యాలు అందించే లక్ష్యంతో ప్రభుత్వం సముద్రతీర ప్రాంతాల అభివృద్ధి చేపట్టిందన్నారు. అధికారులు ప్రణాళిక ప్రకారం పని చేస్తూ బీచ్ సుందరీకరణ పనులు వేగవంతంగా చేపట్టాలన్నారు. బీచ్ పరిసరాలలో ప్లాస్టిక్, తూటు, ఇతర పిచ్చిమొక్కలు తొలగించి, క్లీన్ అండ్ గ్రీన్‌గా బీచ్ పార్కు ఉండేలా చూడాలన్నారు. కలెక్టరుతో పాటు జిల్లా తిమ్మాపురం ఎస్‌హెచ్‌ఓగా పనిచేస్తున్న ట్రైనీ ఏఎస్పీ సుస్మిత, కాకినాడ నగరపాలక సంస్థ ఎస్ఈ కామేశ్వరరావు, జిల్లా పర్యాటక శాఖ అధికారి పి.పోశయ్య, అసిస్టెంట్ టూరిజం అధికారి వి.త్రిమూర్తులు, ఏపీటీడీసీ ఏఈ వెంకటేష్, కొడా ఈఈ రామారావు, జిల్లా పంచాయతీ సిబ్బంది, కొడా ఏఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికే నిధులు



సమావేశంలో మత్స్యకారుల సమస్యలపై చర్చిస్తున్న మత్స్యకార నాయకులు

కాకినాడ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధికి బడ్జెట్లో కేటాయించిన రూ.54 కోట్లను మత్స్యకార సంఘాల అభివృద్ధికి, వారి సంక్షేమానికి వినియోగించాలని మత్స్యకార సంఘ నాయకులు కోరారు. గురువారం కాకినాడలోని జిల్లా మత్స్య శాఖ అధికారి కార్యాలయంలో జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు బలసాడి రంగారావు అధ్యక్షతన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మత్స్య సహకార సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మత్స్యశాఖ డీఎఫ్ఓ కే కరుణాకర్‌రావు, స్టేట్ ఫిషర్‌మెన్ సొసైటీ కన్వీనర్ అంపోలు సత్యనారాయణ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నెయిలి కుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మేడపాడు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేపల వ్యాపారం చేసుకునే మత్స్యకారులకు వాహనంతో పాటు ఐస్ బాక్స్ బదులుగా హీరో హోండా, ఐస్ బాక్స్‌ను 75 శాతం సబ్సిడీపై మంజూరు చేయాలని కోరారు. సముద్ర జలాల్లో కాకుండా వేరే చోట్ల వేట చేసుకునే మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో భృతి ఇవ్వాలని సూచించారు. కాకినాడ ఫిషింగ్ హార్బర్‌లో ఆప్కాబ్ బంకును జిల్లా మత్స్య సహకార సంఘానికి ఇచ్చేలా తీర్మానం చేశారు. అలాగే మత్స్యకార నాయకులు సూచించిన అంశాలపై చర్చించారు.

మహిళాభ్యున్నతి మీ నుంచే..

ఘనంగా మహిళా దినోత్సవం



సత్యసునందను సత్కరించి మాట్లాడుతున్న సీడీపీవో జ్యోతి

కాకినాడ క్రైం: శిశువు, బాలిక, యువతి, మహిళ ఇలా అన్ని దశల్లోనూ స్త్రీ వెన్నంటి ఉండేది మీరేనని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లను ఉద్దేశించి ఐసీడీఎస్ సీడీపీవో జ్యోతి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా గురువారం కాకినాడలోని స్థానిక డెయిరీఫాం సెంటర్‌లో ఐసీడీఎస్ కార్యాలయంలో కాకినాడ సెక్టార్ సమావేశం జరిగింది. శిశువుగా జననం నుంచి ఓ మాతృమూర్తిగా మారే పరిణామ క్రమంలో గర్భిణిని, ప్రసవానంతరం తల్లిని కంటికి రెప్పలా కాచుకునేది అంగన్‌వాడీలేనన్నారు. ఇన్ని దశల్లో వారితో పాటు నడిచే మీరు వారి అభ్యున్నతి లోనూ కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. పీడీ విజయకుమారి పర్యవేక్షణలో వారోత్సవంలో ఆరో రోజు సమావేశం ఏర్పాటు చేయగా ఏడో రోజు శుక్రవారం నగరంలో 2కే మారథాన్ నిర్వహించనున్నట్టు జ్యోతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకినాడకు చెందిన ప్రముఖ యోగా గురువు ధర్మాడి దుర్గాశాంత ప్రసాద్ ఆధ్వర్యంలో యోగా తరగతులు నిర్వహించారు. ప్రసాద్ మాట్లాడుతూ శరీరాన్ని, మనసుని సమతుల్యం చేసుకుంటే విధి నిర్వహణలో నాణ్యత పెరుగుతుందన్నారు. శారీరక, మానసిక వికాసానికి యోగా ఎంతగానో దోహదపడుతుందన్నారు. అనంతరం పోషకాహార నిపుణురాలు అనిత సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ పోషకాహార ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫుడ్ ఎగ్జిబిషన్‌లో 15 మంది తల్లులు పాల్గొని పోషకాలతో కూడిని విభిన్న వంటకాలను ప్రదర్శించారు. ప్రదర్శనలో చిరు ధాన్యాల వంటలకు పెద్ద పీట వేశారు. గురువారం నాటి వారోత్సవ వేడుకల్లో వివిధ కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన సిబ్బంది, విధి నిర్వహణలో విశేష సేవలందించిన అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులతోపాటు దివ్యాంగులైన సిబ్బందిని, స్ఫూర్తివంతమైన జీవన పోరాటంతో ఆదర్శవంతురాలిగా నిలిచిన ఎస్.రాజేశ్వరి అనే మాతృమూర్తిని సత్కరించారు. కార్యక్రమంలో పార్కిన్ సన్స్ వ్యాధికి గురై చచ్చుబడుతున్న శరీరంతో సేవలందిస్తున్న గంద్రేడు అంగన్‌వాడీ టీచర్ సత్యసునందను ప్రత్యేకంగా సత్కరించి మెమెంటో అందించారు. ఈ సమావేశంలో సూపర్‌వైజర్లు దయామణి, ప్రభావతి, అరుణశ్రీ, అరుణదుర్గాంబ, శ్రీగౌరీ, శ్రీపద్మావతితో సహా 240 మంది కార్యకర్తలు, 236 హెల్పర్లు పాల్గొన్నారు.

పన్నుల వసూలే లక్ష్యంగా..



పన్ను చెల్లించని ఖాళీ స్థలం వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న కాకినాడ కార్పొరేషన్ సిబ్బంది

బోట్‌క్లబ్: ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి కార్పొరేషన్‌లో పేరుకుపోయిన పన్నుల బకాయిలు మొత్తం రాబట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నట్టు డిప్యూటీ కమిషనర్ మనోహర్ గురువారం విలేకరులకు తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనైనా ఈ నెలాఖరు నాటికి పన్ను బకాయిలు వసూలు చేసి తీరాల్సిందేనని కమిషనర్ భావన ఆదేశించడంతో కుళాయిలు కట్ చేయడం, ఖాళీ స్థలాల వద్ద జప్తు చేస్తామంటూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో అద్దెలు చెల్లించని షాపును సీజ్ చేస్తామని తెలిపారు. ఆస్తి పన్నుకు సంబంధించి పాత బకాయిలు రూ.ఐదు కోట్లు, ప్రస్తుత సంవత్సరానికి సంబంధించి రూ.8.8 కోట్లు, మొత్తం రూ.13.8 కోట్ల బకాయిలు వసూలు కావల్సి ఉందన్నారు. అలాగే ఖాళీ స్థలాలపై పన్నులు రూ.2.5 కోట్లు, మంచినీటి కుళాయి పన్నులకు సంబంధించి మొత్తం 7.5 కోట్లు రావాల్సి ఉందని తెలిపారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్సులలో దుకాణాలను అద్దెకు తీసుకున్న వారి నుంచి రూ.90 లక్షల మేర బకాయిలు రావాలని వెల్లడించారు. ఈ మార్చి నెలాఖరునాటికి అనుకున్న లక్ష్యం పూర్తి చేసేలా ప్రతి వార్డులో నోడల్ ఆఫీసర్, అడ్మిన్, సెక్రటరీలను అప్రమత్తం చేస్తున్నట్టు తెలిపారు. వారు తమ పరిధిలోని డివిజన్లలో బకాయిదారుల ఇళ్లకు వెళ్లడం వారికి నోటీసులు ఇవ్వడం, వాటికి వారు స్పందించకపోతే, ఆ ఇంటికి సంబంధించిన మంచినీటి సరఫరా కుళాయిని కట్ చేస్తామన్నారు. స్థలాలను జప్తు చేస్తామని, ఇందుకు సంబంధించిన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్సులలో అద్దె చెల్లించని వారి దుకాణాలను సీజ్ చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు కాకినాడ నగరంలో సుమారు 200 వరకు కుళాయిల కనెక్షన్లు కట్ చేసినట్టు తెలిపారు. అలాగే 15 ఖాళీ స్థలాల వద్ద జప్తు హెచ్చరిక బ్యానర్లు ఏర్పాటు చేసినట్టు ఆయన వెల్లడించారు. సుమారు 11 దుకాణాలను సీజ్ చేసినట్టు చెప్పారు.

ఆశా కార్యకర్తల ఆందోళనను అడ్డుకున్న పోలీసులు

కాకినాడ సిటీ: ఆశా కార్యకర్తలకు కనీస వేతనాలు చెల్లించాలని, పని భారం తగ్గించాలని కోరుతూ ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ అనుబంధ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమం ఉద్రిక్తకు దారితీసింది. రైళ్లు, బస్సుల నుంచి టికెట్లు కొనుగోలు చేసి వెళ్తున్న ఆశా కార్యకర్తలను పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకుని నిర్బంధించారు. దీనికి వ్యతిరేకంగా కాకినాడ కలెక్టరేట్ వద్ద గురువారం ఆశా కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు జి బేబీరాణి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు గత ఆరు ఏళ్ల నుంచి వేతనాలు పెంచలేదని, నిత్యావసర సరకుల ధరలు ఏటా పెరిగిపోతున్నాయన్నారు. చాలీచాలని వేతనాలతో కుటుంబాలను నెట్టుకురావడం కష్టంగా ఉందన్నారు. కనీస వేతనాలు రూ. 26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆశా కార్యకర్తల శాంతియుత ఆందోళనను విచ్ఛిన్నం చేయడానికి చర్చలు జరుపుతున్నట్లు నటిస్తుందని విమర్శించారు. ప్రభుత్వం అంగీకరించిన మినిట్స్ మేరకు గ్యాడ్యుటీ, మెటర్నిటీ లీవ్, ఉద్యోగ విరమణ కాలపరిమితి జీవోలను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు పాప, మణి, సత్యవతి, ధనలక్ష్మి, కృపారాణి, పాపయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్మీడియెట్ పరీక్షలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఇంటర్‌మీడియెట్ ప్రథమ సంవత్సర పరీక్షలు ఐదో రోజు గురువారం జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా ముగిశాయి. బోటనీ, గణితం, సివిక్స్ పరీక్షలో భాగంగా 22,354, మంది హాజరుకాగా 883 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 1675 మంది హాజరు కాగా 137మంది గైర్హాజరయ్యారని జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి జీజీకే నూకరాజు తెలిపారు.

నాగార్జున చెరువులో చేపల వేట ప్రారంభం



సామర్లకోట నాగార్జున చెరువులో ప్రారంభమైన చేపల వేట

సామర్లకోట: ప్రతి ఏడాది నాగార్జున చెరువులో ఏప్రిల్‌లో ప్రారంభమయ్యే చేపల వేట ప్రస్తుతం మార్చిలో మొదలైంది. ఉండూరు రైల్వే గేటు వద్ద సుమారు 350 ఎకరాల విస్తీర్ణంలో పబ్లిక్ హెల్త్ ఆధ్వర్యంలో చెరువును తవ్వి కాకినాడ నాగార్జున ఫ్యాక్టరీకి చెరువులో నీరు వాడకం హక్కు కల్పించారు. తదుపరి 2000 సంవత్సరంలో ఈ చెరువులో నీటిని తాగునీటిగా ఉపయోగించడానికి అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దాంతో నాగార్జున చెరువును తాగునీటి చెరువుగా గుర్తింపు పొందింది. అయితే పబ్లిక్ హెల్త్ అధికారులు అనుమతితో మత్స్యకార సంఘ నాయకులు ఈ చెరువులో చేపలు పెంచుతూ ప్రతి ఏడాది చేపల వేట సాగిస్తున్నారు. ఈ తాగునీటి చెరువులో బుధవారం నుంచి చేపల వేట ప్రారంభించారు. దాంతో చెరువులో నీరు కలుషితం అయిపోతుందని, చేపలు పెంచడానికి వీలులేదని మానవహక్కుల సంఘ నాయకులు నూతలపాటి అప్పలకొండ, కుంచే నానిబాబులు డిమాండ్ చేస్తున్నారు. తాగునీటి చెరువులో చేపల వేట సాగించడానికి వీలు లేదని మానవహక్కుల సంఘ నాయకులు వ్యతిరేకిస్తున్నారు. కలుషితమైన నీటి వలన ప్రజలు అనారోగ్యానికి గురి అయితే అధికారులే బాధ్యత వహించవలసి వస్తుందన్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్యను వివరణ కోరగా నాగార్జున ఫిల్టరు చెరువులో నీరు ఆకుపచ్చ రంగులోనికి మారిపోవడంతో ఆ చెరువులో నీటిని తాగునీటిగా ఉపయోగించడం లేదన్నారు. ఈ మేరకు కలెక్టరు చెరువులో చేపలను పట్టుకున్న తరువాత నీటిని పూర్తిగా తీసి వేసి కొత్త నీటితో చెరువును నింపాలని సూచించారన్నారన్నారు. దాంతో చెరువులో చేపల వేట జరుగుతుందని చెప్పారు. ఈనెల 10వ తేదీలోపు చేపల వేట పూర్తి చేయాలని మత్స్య కార సంఘ నాయకులకు సూచించారన్నారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా చెరువులోనికి వచ్చే నీటిని బైపాస్ మార్గంలో ఫిల్టర్ బెడ్‌లోనికి మళ్లించి తాగునీరు అందించాలన్నారు. చెరువులో నీటిని తీసి వేసిన తరువాత గోదావరి కాలువలోని నీటితో నింపి అప్పటి నుంచి చేపల పెంపకం పూర్తిగా నిషేధించేలా చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.

మంచు కురిసే వేళలో..

- పొగమంచుతో 7.30 గంటలకూ కనబడని రహదారి



కరపలోని సామూహిక రక్షిత మంచినీటి చెరువుపై కప్పిన మంచుదుప్పటి

కరప: గ్రామాలను పొగ మంచు కమ్మేసింది. ఉదయం 8 గంటల వరకూ కూడా సూర్యుని కిరణాలు భూమిని తాకలేదు. మంచు కారణంగా రహదారి కనబడక లైట్లు వేసుకుని వాహనాలు నడచాయి. వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నా మంచు విపరీతంగా కురవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు.

మామిడిపూత ఆశాజనకంగా ఉందనుకుంటే మూడు రోజులుగా కురుస్తున్న మంచువల్ల పూత మాడిపోయి నష్టం వాటిల్లుతుందని మామిడి రైతులు ఆవేదన చెందుతున్నారు. మహాశివరాత్రి వెళ్లింది, ఉగాది రాపోతోంది, మరో పక్క ఎండలు పెరుగుతున్నాయి. అయినా నాలుగు రోజులుగా అర్ధరాత్రి నుంచి ఉదయం వరకు మంచు కమ్మేస్తుండడంతో వాతావరణం విచిత్రంగా ఉంటోందని, ఇలా గతంలో చూడలేదని వృద్ధులు అంటున్నారు.



కరప నుంచి రామచంద్రపురం వెళ్లే రోడ్డులో..



కరపలో మంచి నీటి చెరువు వద్ద..



కరప-కాకినాడ రహదారిలో కురుస్తున్న మంచు